నేటి కందం-నేటికి అందం

ముదమిడు భారత మందున
పదకొండవ బ్రిక్సు వేదిపై మంత్రి వరుల్
పదునగు చర్చలు జేసిరి
నదరాజము కరణి నింధనము దొరుకంగన్ !!

(భారత దేశం ఆతిథ్యం యిచ్చిన పదకొండవ బ్రిక్స్ ఇంధన మంత్రుల సదస్సులో ఇంధన వనరుల చర్చ జరిగింది. భారత దేశం చేస్తున్న ప్రయత్నాలను అన్ని దేశాలూ.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

కమలానికి దగ్గరైతే
కనబడుతది ఓటు
జాగ్రత్తగా లేకుంటే
జరుగుతుంది వేటు
కేంద్రానికి అనుకూలం
కొనసాగుడే ధ్యేయం
ఎన్నికల సంఘానికి
ఎక్కడుంది న్యాయం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 28-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:251 పేజీలు:6 వెల: రూ.1/-


# 'గోదావరి వరదలను ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలి'

### -మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




ఖమ్మం, జూన్ 27:గోదావరి నది వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని, వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో గోదావరి నీరు చేరకుండా, వర్షపు నీరు వేగంగా నదిలోకి వెళ్లేలా పంపింగ్ మోటార్లను సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలని అన్నారు. గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని, ఎరువులు, ముఖ్యంగా యూరియా వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు. భద్రాచలం-కూనవరం రహదారిపై చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. మూడు సంవత్సరాలుగా పనులు పూర్తికాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సారపాక జాతీయ రహదారిపై ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో గోదావరి వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఎత్తును పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు పాల్గొన్నారు.

# దర్శకుడు కే భాగ్యరాజ్ కన్నుమూత.. నివాళులర్పించిన సీఎం విజయ్, రజనీకాంత్!



తమిళనాడు, జూన్ 27: తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, నటుడు, స్క్రీన్‌ప్లే రచయిత కే భాగ్యరాజ్ శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన వయసు 73 సంవత్సరాలు. ఇక భాగ్యరాజ్ మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, సూపర్ స్టార్ రజనీకాంత్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.


ఈ సందర్భంగా భాగ్యరాజ్ భార్య పూర్ణిమ, కుమారుడు శంతనుతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా భాగ్యరాజ్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. భాగ్యరాజ్ మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు కన్నీటి వీడ్కోలు పలుకుతున్నారు.

# షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషికి ఘన స్వాగతం..

నిర్మల్ టౌన్, జూన్ 27: ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీఎంఆర్ఈఐఎస్ (ఒఓీఇమా) వైస్ చైర్మన్ ఫహీం ఖురేషికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్ ఇమ్రానుల్లా తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

# 194 ఏళ్ల తాబేలును కలుసుకోనున్న ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, జూన్ 27:హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్ వెళ్లనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ కలుసుకోనున్నారు.

1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షిగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటర్నరీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# శంషాబాద్ విమానాశ్రయంలో విషాదం.. క్యాన్సర్ బాధిత బాలిక మృతి..

హైదరాబాద్, జూన్ 27: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇవాళ (శనివారం) తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఇథియోపియా నుంచి క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్న ఓ బాలిక మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది. విమాన ప్రయాణ సమయంలో బాలిక ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విమాన సిబ్బంది అత్యవసర వైద్య సహాయం అందించేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు విమానం ల్యాండైన వెంటనే బాలికను శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు.

అయితే, ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో విమానాశ్రయంలో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి తల్లిదండ్రుల రోదనలు ఎయిర్‌పోర్టు ఆవరణలోని ప్రయాణికుల హృదయాలను కలిచివేశాయి. బాలిక మృతికి గల కచ్చితమైన కారణాలపై వైద్యులు, సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనపై మరిన్ని వివరాలు సేకరిస్తున్న అధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

# నిజామాబాద్ బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం



నిజామాబాద్, జూన్ 27: జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు.

ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు

### -జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు గౌరవ అతిథిగా హాజరు

### -సీషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగించనున్న తొలి భారత ప్రధాని..

న్యూఢిల్లీ, జూన్ 27: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారిక పర్యటనలో భాగంగా శనివారం సీషెల్స్ రాజధాని విక్టోరియాలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ఆహ్వానం మేరకు జూన్ 27 నుంచి 29 వరకు ఆయన ఈ దేశంలో పర్యటించనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు మోదీ గౌరవ అతిథిగా హాజరుకానున్నారు.

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. సీషెల్స్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించే తొలి భారత ప్రధానిగా ఆయన చరిత్ర సృష్టించనున్నారు. అలాగే ప్రధాని మోదీ, అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో సమావేశమై రక్షణ, సముద్ర భద్రత, వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆర్థిక సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. సీషెల్స్ స్వర్ణోత్సవ వేడుకల్లో భారత రక్షణ దళాల ప్రతినిధి బృందంతో పాటు భారత నౌకాదళానికి చెందిన రెండు యుద్ధ నౌకలు కూడా పాల్గొంటున్నాయి. భారత్?సీషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

# యుద్ధం తరుణంలో శాంతి వైపు తొలి అడుగు..! ఇజ్రాయెల్ - లెబనాన్ మధ్య చరిత్రాత్మక ఒప్పందం




న్యూఢిల్లీ, జూన్ 27: దశాబ్దాలుగా తీవ్ర ఉద్రిక్తతలతో సమతమవుతున్న ఇజ్రాయెల్, లెబనాన్‌లో దేశాల్లో శాంతి భద్రతల స్థాపన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు పడింది. అమెరికా) మధ్య వర్తిత్వంతో ఈ రెండు దేశాల మధ్య అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఒక చరిత్రాత్మక 'ఫ్రేమ్‌వర్క్ శాంతి ఒప్పందం'కుదిరింది. శాంతి ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. హిజ్బుల్లా వంటి సాయుధ గ్రూపుల నిరాయుధీకరణ, లెబనాన్ సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరించడం, రెండు దేశాల మధ్య శత్రుత్వాలకు ముగింపు పలకడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం.

ఈ ఒప్పందం శాశ్వత శాంతి భద్రతల కోసం ఒక చట్రాన్ని ఏర్పాటు చేయడానికి నాంది పలుకుతుందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ పరస్పర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం కుదరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్, లెబనాన్ రెండు దేశాలు రెండూశాంతియుతంగా జీవిస్తూ తమ తమ దేశాల సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని ఇరు దేశాల మధ్య ఇతర దేశాల జోక్యాన్ని నిలిపివేయాలని పేర్కొన్నాయి. అలాగే ఇన్నాళ్లు నిర్బంధంలో ఉన్నవారి విడుదల, మృతదేహాల అవశేషాలను తిరిగి అప్పగించేందుకు కృషి చేస్తామని ఇరు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. ఇరు దేశాల ప్రజలు సురక్షితంగా తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లడానికి, భవిష్యత్తులో రెండు దేశాల మధ్య శాంతి యుత సంబంధాలు ఏర్పడటానికి ఇది తొలి అడుగు అని అమెరికా, ఇజ్రాయెల్, లెబనాన్ అధికారులు పేర్కొన్నారు.

# పోలియో చుక్కల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



సంగారెడ్డి, జూన్ 27(నేటి నిజం ప్రతినిధి) ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వే బృందాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

జూన్ 28న జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,137 పోలియో బూత్‌లలో ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తొలి రోజు మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలోని 1,80,405 మంది 0?5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1,583 మంది ఏఎన్‌ఎంలు, 904 మంది ఆశా కార్యకర్తలు, 1,505 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 625 మంది ఇతర వాలంటీర్లు, 6 మంది ప్రోగ్రామ్ అధికారులు పాల్గొంటున్నట్లు వివరించారు.

వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో నివసించే చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0?5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, మరోసారి వేయించడం ద్వారా చిన్నారులకు పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రు లందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

# రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు జూలై 5లోగా దరఖాస్తులు సమర్పించాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

సంగారెడ్డి, జూన్ 27(నేటి నిజం ప్రతినిధి)ల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన రైతులు జూలై 5, 2026లోగా తప్పనిసరిగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ కోరారు.

ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, 2026 జూన్ 15 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులకు రైతు భరోసా పథకంలో నమోదు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## దరఖాస్తులు ఎక్కడ సమర్పించాలి

అర్హులైన రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఒఇా) లేదా మండల వ్యవసాయ అధికారి (ఓఇా) కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

సమర్పించాల్సిన పత్రాలు: దరఖాస్తుతో పాటు కింది పత్రాలను జత చేయాలని సూచించారు.

పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ
ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ
బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ
రైతు భరోసా దరఖాస్తు ఫారం

రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి:

ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు. అర్హులైన ప్రతి రైతు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని పొందేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్థిక భద్రతకు గొడుగు భీమా పాలసీ

## (28 జూన్ "జాతీయ భీమా అవగాహన దినం" సందర్భంగా)

ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. వ్యాధులు వెంటాడవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు, ప్రాణాలు సహితం పోవచ్చు. నేడు ఆకస్మికంగా జరిగిన అనర్థానికి మనతో పాటు మన కుటుంబ సభ్యులు బజారున పడే అవకాశాలు ఉండవచ్చు. అనారోగ్యాలు, మరణాలు, ప్రమాద నష్టాలు, విపత్తులు జరిగినపుడు మనకు, మన కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత ఇవ్వడానికి జీవిత భీమా కంపెనీలు వెసులుబాటు కల్పించడం జరుగుతున్నది. మన ఇంటిని, ప్రధాన వస్తువులను కూడా భీమా చేయించుకునే సదుపాయాలు ఉన్నాయి. రేపటి సురక్ష కోసం నేడు మనం తీసుకునే మంచి నిర్ణయమే జీవిత భీమా. మన ఆదాయం, ఆరోగ్యం, ఆస్తి, ఆర్థికం లాంటి వాటికి స్పష్టం జరిగినపుడు భీమా మాత్రమే మనకు తక్షణ రక్షణ గొడుగుగా నిలుస్తుంది. అనర్థాలు చెప్పి రావు కాబట్టి అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలు, అకాల మరణాలు, అనారోగ్యాలు, ప్రకృతి విపత్తులు, ఆస్తి నష్టాలు జరిగినపుడు మనకు భద్రతను ఇవ్వడానికి జీవిత భీమా పాలసీలు ఉపయోగపడతాయి.

### జాతీయ భీమా అవగాహన దినం-2026:

మనకు, మనం అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులకు కొండంత ఆర్థిక అండగా నిలిచే భీమా పాలసీల ప్రాధాన్యాన్ని వివరించడానికి ప్రపంచ దేశాలు ప్రతి ఏట 28 జూన్‌న "జాతీయ భీమా అవగాహన దినం (నేషనల్ ఇన్సురెన్స్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. అనుకోని విధ్వంసం జరిగినపుడు ఆదుకునే ఆపన్నహస్తమే భీమా పాలసీ. ప్రతి ఒక్కరు తమకు అనువైన భీమా పాలసీలను తీసుకొని తమ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. జీవితాలు, వాహనాలు, గృహాలు, ఆరోగ్యాలు, వరదలు, ఆస్తులు, ప్రధాన వస్తువులను భీమా చేయించుకునే వెసులుబాటు కల్పించబడింది.

### భారత్‌లో జీవిత/జనరల్ భీమా కంపెనీలు:

భారతదేశవ్యాప్తంగా 24 జీవిత భీమా కంపెనీలు ఉండగా, అందులో "లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)" మాత్రమే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా పేరుగాంచగా, మిగిలిన 23 కంపెనీలకు పైగా ప్రైవేట్ యాజమాన్యాలతో నడుస్తున్నాయి.

తాజా వివరాల ప్రకారం జీవిత భీమాతో పాటు జనరల్ భీమా కంపెనీలు కలుపుకొని మొత్తం 57 వరకు ఉన్నాయి. వీటిలో 24 జీవిత భీమా కంపెనీలు, 33 జనరల్ భీమా కంపెనీలు ఉన్నాయి. భారత్‌లో ఎల్ఐసి కంపెనీ అగ్రగామిగా అత్యధిక పాలసీలను కలిగి ఉండగా, తర్వాత స్థానాల్లో బజాజ్, ఎస్‌బిఐ లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఐసిఐసిఐ లోంబార్డ్ లైఫ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్, జనరల్ ఇన్సురెన్స్ లాంటి కంపెనీలు మార్కెట్‌లో ముందు వరుసలో ఉన్నాయి. భీమా రంగంలో ఎల్ఐసి మార్కెట్ షేర్ తొలి ఏడాది ప్రిమియమ్ ఆదాయం ఆధారంగా 57 శాతం దక్కించుకొని ఇతర కంపెనీలకు అందనంత దూరంలో నిలుస్తూ తన సత్తాను చాటుకుంటున్నది.

నష్టం జరిగిన తర్వాత దుఃఖించడం కన్న సకాలంలో మనకు నచ్చిన భీమా పాలసీలను తీసుకోవడం ఉత్తమ పౌరుల లక్షణమని తెలుసుకోవాలి.

ఆకస్మిక విపత్తులు, ప్రమాదాలు, ప్రాణాపాయాలకు తక్షణ రక్షణ గొడుగులుగా భీమా పాలసీలు ఆర్థిక భద్రతను కల్పిస్తాయి. నేడే మనం జీవిత భీమా చేసుకుందాం.



-మధుపాళీ
9949700037

# వారణాసిలో భారతదేశ తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీసును

## ప్రారంభించిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, జూన్ 26: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేసే దిశగా ఒక కీలకమైన ఘట్టం నమోదైంది. 2026 జూన్ 25న వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో 'హబ్-అండ్-స్పోక్' నమూనా కింద దేశంలోనే మొట్టమొదటి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీసును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. భారత్‌ను ప్రపంచ విమానయాన కేంద్రంగా మార్చడానికి.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేని అంతర్జాతీయ అనుసంధానతను అందించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది నిదర్శనం.

2030 నాటికి దేశీయ ప్రయాణికులకు, 2047 నాటికి అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రాధాన్యత కలిగిన విమానయాన కేంద్రంగా భారత్‌ను మార్చటమే లక్ష్యంతో ఈ 'హబ్-అండ్-స్పోక్' నమూనాను తీసుకొచ్చారు. దీని వల్ల చేకూరే ప్రయోజనాలు కేవలం విమానయాన రంగానికే పరిమితం కావు. మెరుగైన అంతరాజ్తీయ అనుసంధానత ద్వారా వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం కానున్నాయి. మంత్రిత్వ శాఖ చేపట్టిన అధ్యయనాల ప్రకారం విమానయాన అభివృద్ధి ద్వారా 2030 నాటికి సుమారు 0.4 మిలియన్ల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భారత జీడీపీకి అదనంగా 30 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. ఇక 2047 నాటికి దీని మొత్తం ప్రభావం వల్ల దాదాపు 16 మిలియన్ల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల కల్పనకు మద్దతు లభించటమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 1.4 ట్రిలియన్ డాలర్ల మేర ఊతం లభించనుంది.

ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. "విమాన ప్రయాణాన్ని సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావడం.. సమర్థవంతమైన, సమ్మిళిత, ప్రపంచస్థాయి పోటీతత్వం గల భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే స్వయం సమృద్ధ భారతీయ విమానయాన రంగాన్ని తయారుచేయాలనే మా సంకల్పాన్ని సాకారం చేసే దిశగా ఈ రోజు మనం ఒక పెద్ద ముందడుగు వేశాం" అని పేర్కొన్నారు.

"మన నూతన 'హబ్-అండ్-స్పోక్' నమూనా దేశ ప్రజల ప్రయాణ శైలిలో ఒక విప్లవాత్మక మార్పునకు దారితీస్తుంది. భారత్‌లో ఏ నగరంలో నివసిస్తున్నప్పటికీ ప్రయాణికులు ఇకపై తమ సొంత నగరం నుంచే అంతర్జాతీయ ప్రయాణాన్ని ప్రారంభించొచ్చు. భారతదేశపు సొంత విమానాల్లో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా ఎంతో సులభంగా పూర్తి ఆత్మవిశ్వాసంతో ప్రయాణించొచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ విమాన సర్వీసుల ప్రారంభం సందర్భంగా 'ఈజీ కనెక్ట్' విమానం కోసం మొదటగా చెక్-ఇన్ చేసిన కొద్దిమంది ప్రయాణికులకు జ్ఞాపికగా బోర్డింగ్ పాస్‌లను కేంద్ర విమానయాన మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ పునీత్ కన్సల్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్ శ్రీ విపిన్ కుమార్, ఎయిర్ ఇండియా ప్రధాన కార్యనిర్వాహక అధికారి- మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కాంప్‌బెల్ విల్సన్‌లతో పాటు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), విమానయాన సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'హబ్-అండ్-స్పోక్' నమూనా కింద అంతర్జాతీయ ప్రయాణికులు తమ చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ లాంఛనాలను 'స్పోక్' (చిన్న లేదా ప్రాంతీయ) విమానాశ్రయంలోనే పూర్తి చేసుకుంటారు. తద్వారా అదే వారి అంతర్జాతీయ ప్రయాణానికి మొదటి నిష్క్రమణ స్థానం అవుతుంది. ఉదాహరణకు వారణాసి నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించే ప్రయాణికులు.. ఢిల్లీ వంటి నిర్ణీత 'హబ్' విమానాశ్రయానికి వెళ్లే విమానం ఎక్కడానికి ముందే వారణాసిలోనే అన్ని నిష్క్రమణ లాంఛనాలను పూర్తి చేసుకుంటారు.

అత్యున్నత స్థాయి భద్రత, కార్యాచరణ సమగ్రతను నిర్ధారించడానికి ఈ నమూనాలో పలు రక్షణ చర్యలు ఉన్నాయి. దేశీయ-అంతర్జాతీయ సర్వీసులకు సంబంధించిన రెండు దశల ప్రయాణాలను కూడా అంతర్జాతీయ కార్యకలాపాలుగానే పరిగణిస్తారు. దేశీయ (డీ-డొమెస్టిక్), అంతర్జాతీయ (ఐ-ఇంటర్నేషనల్) ప్రయాణికులు ఒకరితో ఒకరు కలవకుండా నిరోధించడానికి తగిన గుర్తింపు చిహ్నాలు కలిగిన ప్రత్యేకమైన బోర్డింగ్ కార్డులను జారీ చేస్తారు. ఈ 'హబ్-అండ్-స్పోక్' విధానం కింద ప్రయాణించే అంతర్జాతీయ ప్రయాణికులకు హబ్ విమానాశ్రయాల్లో కస్టమ్స్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

వారణాసిలో 'హబ్- అండ్-స్పోక్' అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించటం.. భారత విమానయాన వ్యవస్థలో ఒక ప్రధాన ఘట్టంగా నిలుస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ సమ్మిళిత, సమర్థవంతమైన, ప్రపంచస్థాయి పోటీతత్వం గల వైమానిక అనుసంధానతను అందించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది.

# డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్ర మోహన్

ఆదిలాబాద్, జూన్ 26: ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కల మందు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు సహకరించాలని నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జయచంద్ర మోహన్ పిలుపునిచ్చారు.



శనివారం ఊట్కూర్ మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వివిధ పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయనున్నట్లు తెలిపారు.

ఆదివారం పోలియో కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం జూన్ 29, 30 తేదీల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చుక్కల మందు వేస్తారని పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అత్యంత అవసరమని, గతంలో చుక్కలు వేయించినప్పటికీ ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

పోలియో వైరస్ నుంచి పిల్లలకు సంపూర్ణ రక్షణ కల్పించడంలో ఈ కార్యక్రమం కీలకమని పేర్కొన్న ఆయన, జిల్లాలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తీసుకువచ్చి చుక్కల మందు వేయించాలని తల్లిదండ్రులను కోరారు.

పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోషి, జిల్లా అధికారి విజయకుమార్, హెల్త్ సూపర్వైజర్ మణిమాల, ఏఎన్ఎంలు గోవిందమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఆదిలాబాద్, జూన్ 27ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామ బీఎల్‌వో రత్నాల గంగవ్వ కోరారు.

శనివారం మాసాయిపేట్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం కోసమే ఈ ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఓటర్లకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవింద్, రేషన్‌షాప్ డీలర్ షేక్ అజీజ్, స్థానిక నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి..

## -మాజీ ఎంపీపీ భూక్య అమ్మి బాపూరావు



ఆదిలాబాద్, జూన్ 27 కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచేసుకోవాలని కడెం మండల మాజీ ఎంపీపీ భూక్య అమ్మి బాపూరావు కోరారు.


కడెం మండలంలోని పాత మద్దిపడగ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలన, మ్యాపింగ్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్, మండల అధ్యక్షుడు నల్ల జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఎల్‌వో రాజమణితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా పరిశీలన చేపట్టారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పంజాల శకుంతల రామగౌడ్, ఉపసర్పంచ్ డి. రమణయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దల దేవయ్య, పార్టీ బీఎల్ఏలు, ఆల్‌పార్టీ నాయకులతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు ఈ ప్రత్యేక సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించి, తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాకేం సదానందం, పల్లె నారాయణ, బూత్ కమిటీ సభ్యులు జైల నర్సయ్య, బుగ్గరాపు భీంరాజ్, రాకేం రాజేశ్వర్, గ్రామస్తులు పడాల చిన్నయ్య, నవీన్, పల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానము
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
డా॥రావూరి భరద్వాజ జయంత్యోత్సవం





జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారికి
శ్రీమతి రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని శ్రీమతి హరిప్రియ గారికి ప్రదానం

పురస్కార స్వీకర్తలు
శ్రీ పరవస్తు లోకేశ్వర్



సాహిత్యం
10,000/- రూపాయల నగదు పురస్కారం

శ్రీమతి హరిప్రియ



సంగీతం
5000/- రూపాయల నగదు పురస్కారం

ముఖ్యఅతిథి : డా॥పాలకుర్తి మధుసూదనరావు
పూర్వ సి.ఇ.ఓ.శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, టి.టి.డి.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ
సాహితీవేత్త
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీకిరణం
అతిథిసత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వరరావు
ధర్మకర్త (ట్రస్టీ), డా॥రావూరి భరద్వాజ - రావూరి కాంతమ్మ ట్రస్ట్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

సాంస్కృతిక కార్యక్రమం
చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణశబ్దం' కూచిపూడి నృత్యం
&
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంవారి కూచిపూడి నృత్యం

తేది:05.07.2026, ఆదివారం సా॥5.00గం॥లకు
కళాలలిత కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్
లయన్ వి.వి.రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి : 9866332738

# భక్తుల సౌకర్యాలపై అధికారులకు కీలక ఆదేశాలు..

## -శ్రీశైలం పుణ్యక్షేత్రంలో అమ్మవారిని దర్శించుకున్న దేవదాయశాఖ మంత్రి

## -రూ. 60 కోట్లతో 297 గృహాల నిర్మాణం..

## -సదుపాయాలపై భక్తులతో అభిప్రాయాలను తెలుసుకుంటున్న మంత్రి

అమరావతి, జూన్ 27: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

ఆలయానికి చేరుకున్న మంత్రికి రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అర్చక స్వాములు, వేదపండితులు వేదాశీర్వచనం చేసి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దర్శన ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, క్యూ లైన్ల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మ వారి, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మంత్రి నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలపై అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

అనంతరం సున్నిపెంటలో దేవస్థానం ఉద్యోగుల కోసం నిర్మించిన గృహాలను అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు రూ.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 297 గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, త్వరలో దేవస్థానం ఉద్యోగులను ఈ గృహాలకు తరలిస్తామని మంత్రి తెలిపారు.

# కౌతవరం పీఏసీఎస్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం..

## -ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

అమరావతి, జూన్ 27:గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం ప్రారంభించారు.

ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే రాము, సంఘ సభ్యులతో కలిసి వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్లాంట్‌ను పరిశీలించి నీటి నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమున్నారు. పీఏసీఎస్‌లు కేవలం రుణాలు ఇచ్చే సంస్థలు కాదు, రైతులకు, గ్రామ ప్రజలకు బహుళ సేవలు అందించే కేంద్రాలుగా మారాలన్నారు. కౌతవరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, టీడీపీ నాయకులు వల్లభనేని బాబురావు, చేకూరు జగన్మోహనరావు, బ్యాంక్ చైర్మన్ యుగంధర్, ఈడే కృష్ణ, దేశపతి, కొడాలి రామరాజు, బాబి, తూము పద్మజ, మల్లిపెద్ది సుబ్రమణ్యం, అరసవిల్లి శివ రాజేష్, వల్లభనేని రంగబాబు, జోజి, పిచ్చే ఈశ్వరరావు, గరికిపాటి బ్రదర్స్, సొసైటీ ఉద్యోగులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'భారత్- యూకే సీఈటీపీ' ద్వారా గరిష్ఠ ప్రయోజనాలు పొందేలా సహాయం చేసేందుకు దేశవ్యాప్తంగా

# 1,000 మంది సలహా సిబ్బందిని నియమించనున్నట్లు ప్రకటించిన కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, జూన్ 27:'భారత్- బ్రిటన్ సీఈటీపీ' ద్వారా వ్యాపార వాణిజ్య సంస్థలు గరిష్ఠ ప్రయోజనాలు పొందేలా సహాయ పడేందుకు దేశవ్యాప్తంగా 1,000 మంది సలహా సిబ్బందిని నియమించటంతో పాటు వాణిజ్య వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ప్రకటించారు.

లండన్‌లో ఈ రోజు జరిగిన 10వ వార్షిక 'యూకే-ఇండియా వీక్'లో భాగంగా శ్రీ పీయూష్ గోయల్ పలు ఉన్నత స్థాయి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 జూలై 15 నుంచి అమలులోకి రానున్న 'భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (సీఈటీపీ) ద్వారా లభించబోయే సరికొత్త అవకాశాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఇప్పటివరకు భారత్ కుదుర్చుకున్న అత్యంత సమగ్రమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంగా నిలిచిన 'భారత్-యూకే సీఈటీపీ' ద్వారా.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా 25.5 బిలియన్ పౌండ్ల మేర వృద్ధి చెందుతుందన్న అంచనా ఉంది.

'ఇండియా గ్లోబల్ ఫోరమ్ (ఐజీఎఫ్) క్యాపిటల్ ఫ్రాంటియర్స్ ఫోరమ్'ను ఉద్దేశించి శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. భారత్-యూకే భాగస్వామ్యం కేవలం సంప్రదాయ వాణిజ్యానికే పరిమితం కాకుండా సాంకేతికత, సార్వభౌమ కృత్రిమ మేధ, కీలకమైన ఖనిజాలు, రక్షణ, ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాలకు విస్తరించిందని అన్నారు. ఇరు దేశాల మధ్య మారుతున్న ఈ భాగస్వామ్యం.. ద్వైపాక్షిక ఆర్థిక బంధంలో పెరుగుతున్న లోతును, వైవిధ్యాన్ని తెలియజేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

భారత హైకమిషన్, ఫిక్కీ (ఎఫ్ఐసీసీఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకే పర్యటనకు విచ్చేసిన దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భారీ భారతీయ వ్యాపార ప్రతినిధి బృందానికి ఆయన స్వాగతం పలికారు. ఈ బృందంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన వ్యాపార సంస్థలతో పాటు మొదటిసారిగా ఎగుమతులు ప్రారంభించిన పలువురు పాల్గొనడం విశేషం.

భారతీయ నిపుణులకు 'భారత్-యూకే సీఈటీపీ' ద్వారా చేకూరే ప్రయోజనాలను శ్రీ పీయూష్ గోయల్ ప్రత్యేకంగా వివరించారు. ఈ ఒప్పందం ప్రకారం యూకేలో పనిచేసే అర్హులైన భారతీయ నిపుణులకు అక్కడి సామాజిక భద్రతా విరాళాల (కాంట్రిబ్యూషన్స్) నుంచి ఐదేళ్ల పాటు మినహాయింపు లభిస్తుందని ఆయన తెలిపారు. దీనివల్ల ఆదా అయ్యే సొమ్మును వారు భారత్‌లో వడ్డీ ఇచ్చే పన్ను రహిత భవిష్య నిధి (పీఎఫ్) ఖాతాల్లోకి మళ్లించుకునే వీలుంటుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి (సబ్-నేషనల్) ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయాల్సిన ప్రాధాన్యతను కూడా కేంద్ర మంత్రి ప్రధానంగా చెప్పారు. ఇందులో భాగంగా 'బర్మింగ్‌హామ్-గుజరాత్', 'మాంచెస్టర్-మహారాష్ట్ర' వంటి ప్రాంతాల మధ్య ఉన్న లింకేజీలను భవిష్యత్ ద్వైపాక్షిక వృద్ధికి ముఖ్యమైన చోదక శక్తులుగా ఆయన అభివర్ణించారు.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించడాన్ని శ్రీ పీయూష్ గోయల్ గుర్తుచేశారు. వ్యాపార సంస్థలు పూర్తి ఆత్మవిశ్వాసంతో 'బ్రాండ్ ఇండియా'ను ప్రపంచానికి చాటిచెప్పాలని.. తయారీ, సేవలు, ఆవిష్కరణల రంగాల్లో దేశానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దీనితో పాటు 'యూకే'లోని వ్యాపార సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. 'భారత్-యూకే సీఈటీపీ' ఒప్పందం మార్కెట్ అందుబాటును పెంచుతుందని, భారతీయ పరిశ్రమల పోటీతత్వాన్ని మెరుగుపరుస్తుందని, నిపుణుల రాకపోకలను మరింత సులభతరం చేస్తుందని.. వస్తువులు, సేవలు, పెట్టుబడుల రంగాలలో సరికొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేటి భారత్ నమ్మకానికి, ప్రతిభకు, సమ్మిళిత వృద్ధికి, స్థిరమైన పరిస్థితులకు ప్రతిరూపంగా నిలిచిందని శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. ప్రపంచవ్యాప్త భాగస్వామ్యాలకు, ఉమ్మడి ఆవిష్కరణలకు దేశం అపారమైన అవకాశాలను కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. భారత నిరంతర ఆర్థిక వృద్ధి, విస్తరిస్తున్న ప్రపంచ భాగస్వామ్యాల ద్వారా లభిస్తున్న ఈ సువర్ణ అవకాశాలను వ్యాపార సంస్థలు చక్కగా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

భారత్-యూకే భాగస్వామ్యం వృద్ధి సాధించడానికి అపారమైన అవకాశాలను కలిగి ఉందని కేంద్ర మంత్రి మరింతగా పేర్కొన్నారు. భారతీయ వ్యాపార సంస్థలు ఈ అవకాశాలను ముందుగానే అందిపుచ్చుకోవాలని, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అవలంబించాలని.. యూకేతో వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యాలను బలోపేతం చేసుకుంటూనే ప్రపంచవ్యాప్తంగా 'బ్రాండ్ ఇండియా'ను చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం నిర్దేశించుకున్న దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారతీయ పరిశ్రమలు పోషించాల్సిన పాత్రను కూడా ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

హక్కుల సాధన కోసం

# అవసరమైతే సింగరేణిలో సమ్మె



కరీంనగర్, జూన్ 27: సింగరేణి బొగ్గు పరిశ్రమలో పనిచేసే కార్మికుల హక్కుల సాధన కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎప్పుడు కూడా ముందుంటుందని, డిమాండ్లు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని అవసరమైతే సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు, గుర్తింపు సంఘం ముఖ్య నేత వాసిరెడ్డి సీతారామయ్య తేల్చి చెప్పారు.

శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ఇటీవలనే యాజమాన్యానికి 31 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. యాజమాన్యానికి ఇచ్చిన డిమాండ్లను జాప్యం చేయకుండా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

బొగ్గు పరిశ్రమలో మెడికల్ బోర్డు నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని సీతారామయ్య మండిపడ్డారు. సింగరేణిలో కొత్త గనుల నిర్మాణం కోసం ఏఐటీయూసీ ముందుండి పోరాటం చేస్తుందని, సింగరేణిలో వేజ్ బోర్డు సాధన కోసం అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమం చేస్తామన్నారు.

2014 సంవత్సరం తర్వాతనే సింగరేణికి చెందిన సి ఎస్ ఆర్, డి ఎం ఎస్ టి నిధులు ఇతర ప్రాంతాలకు ఎక్కువగా తరలిపోవడం జరిగిందన్నారు. చందాల కోసం ఘర్షణలు పడి జైల్లోకి వెళ్ళింది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అని సీతారామయ్య గుర్తు చేశారు. ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల పక్షపాతిగా ఉంటుందని? వామపక్ష పార్టీలు మాత్రమే కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతాయని చెప్పారు. మెడికల్ బోర్డు నిర్వహణ చేయకుంటే ఊరుకునేది లేదని సీతారామయ్య తెగేసి చెప్పారు.

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్ మాట్లాడుతూ.. కెసిఆర్ ప్రభుత్వం మూలంగానే సింగరేణి బొగ్గు పరిశ్రమ సర్వనాశనమైందని ఆరోపించారు. టిఆర్ఎస్ హయాంలోనే సింగరేణి బొగ్గు పరిశ్రమలు బొగ్గు బ్లాగులను అమ్ముకున్నారని విమర్శించారు. కంపెనీలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని మండిపడ్డారు. ఏఐటీయూసీ అంటేనే పారదర్శకతకు కేరాఫ్ అడ్రస్ అని రాజ్ కుమార్ నొక్కి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య గౌడ్, కేంద్ర కమిటీ సభ్యుడు కే స్వామి, నాయకులు వైవి రావు, రాజరత్నం, గౌతమ్ గోవర్ధన్, టి రమేష్ కుమార్ తోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల అందించాలి..

## -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జూన్ 27:ఓటరు నమోదు ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూలై 3లోపు అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందించి ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు.

ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించడంతో పాటు, మరో ఫారంపై స్వీకరణ ధృవీకరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐస్‌లాండ్‌లో తొలి భారతీయ మామిడి పండ్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించిన భారత రాయబార కార్యాలయం, ఏపీఈడీఏ

న్యూఢిల్లీ, జూన్ 27: ఐస్‌లాండ్ రాజధాని రేక్‌జావిక్‌లోని భారత రాయబార కార్యాలయం భాగస్వామ్యంలో వ్యవసాయం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) ఐస్‌లాండ్‌లో తొలిసారిగా భారతీయ మామిడి పండ్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా 2026 జూన్ 24న రేక్‌జావిక్‌లో, జూన్ 25న ఉత్తర ఐస్‌లాండ్‌లోని అకురేరి నగరంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భారతీయ మామిడి పండ్లలోని అద్భుతమైన వైవిధ్యాన్ని, వాటి ఎగుమతి సామర్థ్యాన్ని ఈ కార్యక్రమాల ద్వారా అక్కడి వారికి చాటిచెప్పారు. ఐస్‌లాండ్ దేశంలో భారతీయ మామిడి పండ్ల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం ఇదే తొలిసారి.

ఈ సందర్భంగా భారత రాయబారి ఆర్ రవీంద్ర మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ మామిడి రకాల ప్రత్యేకతలను, వాటి అద్భుతమైన రుచులను వివరించారు. ఐస్‌లాండ్ దేశానికి భారతీయ మామిడి పండ్ల ఎగుమతులను మరింత విస్తరించడానికి ఎంతో అనుకూలమైన అవకాశాలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఐస్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన వాణిజ్య ఒప్పందాల డైరెక్టర్ శ్రీ స్వీన్ కే ఐనార్సన్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత్-ఈఎఫ్‌టీఏమధ్య కుదిరిన వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ద్వారా లభించే వ్యాపార అవకాశాలను ఆయన ప్రస్తావించారు. ఈ ఒప్పందం వల్ల భారత్ నుంచి ఐస్‌లాండ్‌కు మరిన్ని మామిడి పండ్లను సులభంగా దిగుమతి చేసుకోవడానికి గొప్ప అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

ఐస్‌లాండ్ ట్రేడ్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ శ్రీ ఓలాఫుర్ స్టీఫెన్సన్ మాట్లాడుతూ... ఐస్‌లాండ్ వ్యాపార వర్గాలలో భారత్ పట్ల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులను, ముఖ్యంగా మామిడి పండ్ల దిగుమతులను పెంచుకోవడానికి ఇరు దేశాల మధ్య అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో భారత దేశ మామిడి ఉత్పత్తిపై భారత రాయబార కార్యాలయ రెండో కార్యదర్శి సుశ్రీ అనీషా తోమర్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యధికంగా మామిడి పండ్లను పండించే దేశంగా భారత్ స్థానాన్ని ఆమె ప్రముఖంగా వివరించారు. నాణ్యతా ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు, ప్రపంచవ్యాప్త ప్రచారం ద్వారా మామిడి ఎగుమతులను పెంచడానికి భారత ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలను ఆమె ఈ సందర్భంగా వివరించారు.

ఈ ప్రచార కార్యక్రమాలకు అక్కడి ప్రతినిధుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఐస్‌లాండ్‌కు చెందిన దిగుమతిదారులు, వివిధ దేశాల దౌత్యవేత్తలు, ఐస్‌లాండ్ వ్యాపార ప్రముఖులు, ఐస్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ ప్రదర్శనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ ప్రదర్శనకు విచ్చేసిన అతిథులకు భారత్‌కు చెందిన నాలుగు ఉత్తమమైన మామిడి రకాలైన దశేరి, చౌసా, లంగ్రా, కేసర్లను అందించారు. వీటి అద్భుతమైన రుచి, సువాసన, నాణ్యతను అక్కడి వారు ఎంతగానో ప్రశంసించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, భారతీయ వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి, భారత్-ఐస్‌లాండ్ మధ్య పెరుగుతున్న ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడానికి ఈ కార్యక్రమాలు ఒక విలువైన వేదికగా నిలిచాయి.

ప్రస్తుతం ఐస్‌లాండ్ దేశం తన మామిడి పండ్ల అవసరాల కోసం ప్రధానంగా థాయిలాండ్, బ్రెజిల్, కంబోడియా, ఘనా, పెరూ దేశాలపై ఆధారపడుతోంది. ప్రత్యామ్నాయ సరఫరాదారులు తక్కువగా ఉండటం వల్ల ఇప్పటివరకు ఆయా దేశాల మామిడి పండ్లు ఐస్‌లాండ్ మార్కెట్లో స్థానం సంపాదించాయి. ఐస్‌లాండ్ గత ఏడాది (2025)లో సుమారు 3.3 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన మామిడి పండ్లను దిగుమతి చేసుకోగా, అందులో దాదాపు 1 మిలియన్ డాలర్ల విలువైన మామిడిని ఒక్క థాయిలాండ్ నుంచే దిగుమతి చేసుకుంది. ఈ కార్యక్రమం సందర్భంగా అక్కడి స్థానిక వినియోగదారులతో భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు జరిపిన సంభాషణల్లో.. ఐస్‌లాండ్ ప్రజలకు మామిడి పండ్లంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా వాటిని స్మూతీలు, తీపి వంటకాలు (డెజర్ట్‌లు), పండ్ల సలాడ్లలో ఎక్కువగా ఇష్టపడతారని తెలిసింది. ఈ నేపథ్యంలోఅద్భుతమైన రుచి గల భారతీయ మామిడి పండ్లకు ఐస్‌లాండ్ మార్కెట్లో భవిష్యత్తులో చాలా గొప్ప అవకాశాలు ఉన్నాయని స్పష్టమవుతోంది.

# చల్లగరిగలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం..



నల్గొండ, జూన్ 27: మండలంలోని చల్లగరిగె గ్రామంలో గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య ఆధ్వర్యంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

కర్రె నర్సింహారెడ్డి ఇంటి ముందు నుంచి కమ్యూనిటీ హాలు కూడలి వరకు, అలాగే శివాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.చాలా కాలంగా శిథిలావస్థకు చేరిన ఈ రహదారి కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ జంపయ్య తెలిపారు.

గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, వార్డు సభ్యులు తోట సురేష్, శత్రు నాయక్, మూల మంజుల, కోడెపాక సునీత, మ్యాదరి జయ, దూదిపాల తిరుపతమ్మ, కాంగ్రెస్ నాయకులు నల్ల రాజిరెడ్డి, బైరిశెట్టి మహేందర్, దూదిపాల బుచ్చిరెడ్డి, జయపాల్ రెడ్డి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలకు పామాయిల్ రైతుల ఆత్మీయ ఆహ్వానం

## ప్రత్యేక రైతుల సమ్మేళనానికి రావాలని ములకలపల్లి రైతుల వినతి



ఖమ్మం, జూన్ 27:రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పామాయిల్ రైతుల మధ్య నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆత్మీయ అనుబంధం శుక్రవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలో మరోసారి ఆవిష్కృతమైంది. తమ అభిమాన నాయకుడిని కలిసేందుకు ములకలపల్లి మండలానికి చెందిన పామాయిల్ రైతులు పెద్ద సంఖ్యలో గండుగులపల్లికి చేరుకుని ఆత్మీయంగా ఆహ్వానించారు.

దశాబ్దాలుగా తమకు అండగా నిలిచి, పామాయిల్ సాగు అభివృద్ధికి కృషి చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన రైతులు భావోద్వేగానికి లోనయ్యారు.

### 40 ఏళ్ల ప్రజా సేవకు అభినందనలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజా జీవితంలోకి అడుగు పెట్టి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రైతులు ఆయనను ఘనంగా అభినందించారు. వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా పామాయిల్ రైతులకు అందించిన ప్రోత్సాహం, నిరంతర సహకారం తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ములకలపల్లిలో "రైతుల ఆత్మీయ సమ్మేళనం" నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తమ ఆతిథ్యాన్ని స్వీకరించాలని మంత్రిని హృదయపూర్వకంగా ఆహ్వానించారు.

రైతులు చూపిన అభిమానాన్ని చూసి మంత్రి తుమ్మల నాగేశ్వంరావు కూడా భావోద్వేగానికి గురయ్యారు. పదవులు ఉన్నా లేకున్నా తనను గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్న రైతుల ప్రేమాభిమానాలు నిజమైన ప్రజా నాయకుడికి లభించే గొప్ప ఆస్తి అని అక్కడి వాతావరణం ప్రతిబింబించింది. రాజకీయాలకు అతీతంగా నాయకుడికి, రైతులకు మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి గండుగులపల్లి వేదికగా నిలిచింది.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నల్లగొండ, జూన్ 26 : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 67 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన రూ.24,69,000/- విలువ గల చెక్కులను శుక్రవారం నల్లగొండలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# గుజరాత్‌లో "భారత్ ట్యాక్సీ" పేరిట సహకార ట్యాక్సీ సేవకు కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా శ్రీకారం

న్యూఢిల్లీ, జూన్ 27: దేశంలోనే తొలిసారిగా "భారత్ ట్యాక్సీ" పేరిట గుజరాత్‌లో సహకార ఆధారిత ట్యాక్సీ సేవలందించే సహకార సంఘానికి కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా జూన్ 27న ప్రారంభోత్సవం చేస్తారు. ఈ మేరకు గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 'భారత్ ట్యాక్సీ' విధానాన్ని 2025 డిసెంబరులో లాంఛనంగా ప్రారంభించారు. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్దేశిత ''సహకారంతో స్వావలంబన' దార్శనికతను రవాణా-చలనశీలత రంగానికి విస్తరించే దిశగా ఇదొక కీలక ఘట్టం కానుంది. 'భారత్ ట్యాక్సీ' సహకార సూత్రాధారిత డిజిటల్ రవాణా వేదిక. 'సారథే యజమాని' భావనకు ఇది వాస్తవ రూపమిస్తుంది. ఈ విధానం కింద ట్యాక్సీ డ్రైవర్లు కేవలం సేవా ప్రదాతలుగానే కాకుండా ఈ వేదిక ద్వారా భాగస్వాములు, యజమానులుగా మారుతారు. తద్వారా ఆర్థిక సాధికారత, సామాజిక భద్రత, యాజమాన్య ప్రయోజనాలు వారి సొంతమవుతాయి.

గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర భాయ్ పటేల్, ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘవి, కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భూతాని, వ్యవసాయ-రైతు సంక్షేమ, సహకారం పశుసంవర్ధక, గోవుల పెంపకం, మత్స్య, ప్రోటోకాల్ మంత్రిత్వ శాఖల సహాయ మంత్రి శ్రీ జితుభాయ్ సావ్జీభాయ్ వాఘాని సహా సహకార రంగంలోని సీనియర్ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, 'భారత్ ట్యాక్సీ'తో ముడిపడిన 4,000 మందికి పైగా డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

భారత్ ట్యాక్సీ భారత తొలి డ్రైవర్-యాజమాన్య రవాణా సేవ ప్రదాన సహకార సంస్థ. ఇది సహకార సూత్రాల ప్రాతిపదికగా 'సహకార ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్' ద్వారా రూపొందిన ఒక వేదిక. దేశంలోని 8 ప్రధాన సహకార సంస్థలు- 'ఎన్‌సీడీసీ, జీసీఎంఎంఎఫ్ (అమూల్), ఎన్‌డీడీబీ, నాఫెడ్, ఇఫ్కో, క్రిభ్‌కో, నాబార్డ్, ఎన్‌సీఈఎల్' మద్దతుతో ఇది 'సారథే యజమాని' భావనకు రూపం ఏర్పడుతుంది. ఈ విధానం కింద ట్యాక్సీ డ్రైవర్లు సేవా ప్రదాతలుగానే కాకుండా భాగస్వాములుగా, యజమానులుగానూ రూపొందుతారు. తద్వారా ఆర్థిక సాధికారత, సామాజిక భద్రత సహా యాజమాన్య ప్రయోజనాలు లభిస్తాయి.

ఈ కార్యక్రమంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లను ధ్రువీకరణ పత్రాలతో సత్కరిస్తారు. అలాగే, వివిధ సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలను కూడా ఇచ్చిపుచ్చుకుంటారు.

దేశవ్యాప్త సహకార ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన గుజరాత్ రాష్ట్రం 'భారత్ ట్యాక్సీ' విస్తరణలోనూ గణనీయ ప్రగతి సాధించింది. దేశవ్యాప్తంగా గల 7 లక్షల మంది డ్రైవర్లలో గుజరాత్ నుంచి 1.5 లక్షల మందికి పైగా ఇందులో చేరారు. ఇక దేశమంతటా 37 లక్షల మందికి పైగా వినియోగదారులు 'భారత్ ట్యాక్సీ' సేవలను వినియోగించుకుంటున్నారు.

గుజరాత్‌లోని 14 ప్రధాన నగరాలు- అహ్మదాబాద్, సూరత్, ద్వారక, వడోదర, రాజ్‌కోట్, సోమనాథ్, వల్సాద్, ఆనంద్, జామ్‌నగర్, భావ్‌నగర్, నడియాడ్, జునాగఢ్, మెహసానా, అమ్రేలిలలో 'భారత్ ట్యాక్సీ' ప్రారంభమవుతుంది. వచ్చే నెలాఖరులోగాఈ రాష్ట్రంతటా ఈ సేవలను అందుబాటులోకి తేవాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నారు.

బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టం-2002 కింద 'భారత్ ట్యాక్సీ' నమోదు కాగా, 2025 జూన్ 6న ప్రారంభమైంది. ఈ వేదిక 'జీరో-కమిషన్' పద్ధతిలో పనిచేస్తుంది.. ఈ సేవల ద్వారా వచ్చే ఆదాయం ద్వారా డ్రైవర్లకే గరిష్ఠ ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాకుండా డ్రైవర్లకు బీమా, రుణాలు, పెన్షన్ సహా వివిధ ప్రభుత్వ సామాజిక భద్రత పథకాల ప్రయోజనం కూడా అందుతుంది. వినియోగదారుల కోసం గుజరాత్ పోలీసుల సహకారంతో రద్దీ రహిత ధరల విధానం సహా సురక్షిత, విశ్వసనీయ ప్రయాణానికి భారత్ ట్యాక్సీ భరోసా ఇస్తుంది. ప్రయాణికులు తమ సౌకర్యం మేరకు బైక్, ఆటో, కారు వంటి వివిధ రవాణా సాధనాల్లో దేన్నయినా ఎంచుకోవచ్చు.దేశ రవాణా రంగంలో సహకార ఆధారిత ప్రగతి, ఆర్థిక సాధికారత, సామాజిక భద్రత దిశగా భారత్ ట్యాక్సీ ఓ వినూత్న నమూనా. రవాణా రంగంలో సార్వజనీనత, స్వావలంబనలో ఓ కొత్త అధ్యాయం లిఖిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు, ప్రధాన నగరాలన్నిటికీ ఈ విధానం విస్తరణను 'భారత్ ట్యాక్సీ' లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సహాయ కేంద్రాల ఏర్పాటు, డ్రైవర్లకు మరింత సామాజిక భద్రత, సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలతో అనుసంధానం ద్వారా సమ్మిళిత-సహకారాధారిత రవాణా వ్యవస్థను ఆవిష్కరించాలని కృతనిశ్చయంతో ఉంది.

## ఘనంగా నూతన దేవాలయాల శంకుస్థాపన మహోత్సవం



నల్గొండ, జూన్ 27: గ్రామ ప్రజలందరి సహకారంతో, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా మండలం లోని కొత్తగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పలు దేవాలయాలకు శనివారం అత్యంత వైభవంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని భక్తిభావం పెంపొందేలా ఏకకాలంలో పలు ప్రధాన ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేయడం విశేషం.

కితవారిగూడెం శివాలయ ప్రధాన అర్చకులు శ్రీ రామయ్య శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలు, నడుమ శాస్త్రోక్తంగా శంకుస్థాపన పూజా కార్యక్రమాలు జరిగాయి. గ్రామానికి నలుదిక్కులా రక్షణగా, ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటూ కింది ఆలయాలకు పునాది రాళ్ళు వేశారు. రామాలయం, ముత్యాలమ్మ తల్లి ఆలయం, సత్యమ్మ తల్లి ఆలయం, కోట మైసమ్మ తల్లి ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయం త్వరలోనే 'బొడ్రాయి' ప్రతిష్టాపన. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణంతో పాటు గ్రామ రక్షణ దేవతగా కొలిచే బొడ్రాయి (గ్రామ నాభిశిల) ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ ఆలయాల నిర్మాణం వల్ల గ్రామానికి సకల శుభాలు కలుగుతాయని, గ్రామం సస్యశ్యామలంగా వర్ధిల్లుతుందని వారు ఆకాంక్షించారు. "గ్రామ దేవతల అనుగ్రహం కోసమే ఈ ఆలయాల నిర్మాణం చేపడుతున్నాం. అందరి సహకారంతో త్వరితగతిన పనులు పూర్తి చేసి, మహా సంప్రోక్షణ నిర్వహిస్తాం అని ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు. ఈ శంకుస్థాపన మహోత్సవంలో దేవాలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా పాల్గొనాలి

### -మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్

నిజామాబాద్, జూన్ 27:ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రజాప్రతినిధి చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్ పిలుపునిచ్చారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగేష్ రెడ్డి ఆదేశాల మేరకు వేల్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు.

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

## సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక గ్రామసభ..

### -పాఠశాలకు బెంచీల కొనుగోలుకు రూ.12 వేల విరాళం



నిజామాబాద్, జూన్ 27:వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు మెండోరా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామంలో పారిశుద్ధ్యం, వ్యాధుల నివారణ చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీవీ. విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు కూర్చోవడానికి తగినంత డెస్క్ బెంచీలు లేవని గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన పాలకవర్గం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా రూ.12,000 చెక్కును డెస్క్ బెంచీల కొనుగోలు కోసం అందజేసింది.

సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ చేతుల మీదుగా ఉపాధ్యాయుడు ప్రశాంత్‌కు చెక్కును అందించారు.

గ్రామ పాలకవర్గం సభ్యులు అడిగిన వెంటనే పాఠశాల సమస్యను పరిష్కరిం చినందుకు పాఠశాల తరఫున గ్రామ పాలకవర్గ సభ్యులకు ప్రత్యేకతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బాజిరెడ్డి అభిలాష్, డాక్టర్ సంతోష్, సప్పాల సత్యనారా యణ, కొమిరి భూమేష్, మహమ్మద్ షఫీ, రామచంద్ర గౌడ్, కాంగ్రెస్ నాయకులు పల్లి శేఖర్, చాకలి గంగాధర్, తెనుగు పోషన్న, మెడికల్ సత్యం, బ్రిస్టల్ భూమన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధికి పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్థులు అభినందించారు.

## నూతన ఎంపీడీవోను సన్మానించిన సర్పంచ్..



మహబూబ్‌నగర్, జూన్ 27: నారాయణపేట జిల్లా ఊట్కూర్ నూతన ఎంపీడీవో గా పావని ఇటీవలపదవిబాధ్యతలు స్వీకరించడంతో బిజ్వార్ సర్పంచ్ కొల్లంపల్లి అంజయ్య తో పాటు బిజెపి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని గ్రామాల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి మంజూరు చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బాలాజీ, వార్డ్ సభ్యులు రాఘవేంద్ర, రాజు, బిజెపి నాయకులు ఆంజనేయులు గౌడ్, పత్తి ఆంజనేయులు, కే. వెంకటప్ప, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు లేబర్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలి..

మహబూబ్‌నగర్, జూన్ 27: ప్రభుత్వం మంజూరు చేసిన లేబర్ కార్డు ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి సర్పంచ్ ఆర్. నర్సిములు అన్నారు.

శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలో ని కొత్తపల్లిలో అర్హులైన కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్నవివిధ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు విధిగా లేబర్ కార్డు తీసుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కాపాడేందుకుము ందుంటానని అన్నారు. లేబర్ కార్డు ఉండటం వల్ల కార్మికులకు కలిగే లాభాలను గురించి వివరించారు. కొత్తపల్లి గ్రామంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ లేబర్ కార్డులు మంజూరు చేసే విధంగా చూస్తామన్నారు. కార్మికరంగంలో పనిచేస్తున్న అర్హులకు ప్రభుత్వ పలాలు అందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బలరాం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రియురాలి హత్య వెనుక దాగిన దారుణ నిజాలు..

### -మాజీ ప్రియుడే హంతకుడిగా తేల్చిన దర్యాప్తు

గుంటూరు. జూన్ 27: దుగ్గిరాల పాత లాకుల వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన వెనుక దాగి ఉన్న దారుణాన్ని మంగళగిరి రూరల్, దుగ్గిరాల పోలీసులు ఛేదించారు. మొదట గుర్తుతెలియని మహిళగా నమోదైన ఈ కేసు చివరికి ప్రేమ, మోసం, డబ్బు, ప్రతీకారం చుట్టూ తిరిగిన హత్యగా తేలింది. మాజీ ప్రియురాలినే పథకం ప్రకారం నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు.

### గుర్తుతెలియని మృతదేహంతో మొదలైన మిస్టరీ

దుగ్గిరాల పాత లాకుల సమీపంలో ఓ మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మహిళ మెడపై గాయాలు గుర్తించి, ఇది హత్యేనని నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతురాలి ఆచూకీ కోసం రాష్ట్రవ్యాప్తంగా లుక్అవుట్ నోటీసులు జారీ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సాంకేతిక ఆధారాలు, విచారణలో భాగంగా మృతురాలు తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజులమాండ్యం ప్రాంతానికి చెందిన మీనాటి మేనకగా పోలీసులు గుర్తించారు. దర్యాప్తు మరింత లోతుగా సాగించగా మేనకకు గుంటూరు జిల్లా వెల్లబాడు గ్రామానికి చెందిన వల్లభాపురం చిరంజీవితో కొంతకాలంగా ప్రేమ సంబంధం ఉన్నట్లు తేలింది.

ఇటీవల చిరంజీవి మరో మహిళను వివాహం చేసుకోవడంతో మేనక తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగాయి. చివరకు పెద్దల సమక్షంలో రాజీ కుదిరి మేనకకు రూ.5 లక్షలు మూడు విడతల్లో నష్టపరిహారంగా చెల్లించాలని చిరంజీవికి సూచించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఏడాది మే 29న తొలి విడత డబ్బులు తీసుకోవడానికి మేనక గుంటూరుకు వచ్చింది. అయితే అదే రోజు ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. అప్పటికే హత్యకు పథకం వేసుకున్న చిరంజీవి మేనకను దుగ్గిరాల పాత లాకుల వద్దకు తీసుకెళ్లి, అక్కడే గొంతు నులిమి దారుణంగా హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్య అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడు ఈ ఘటనను ప్రమాదంగా లేదా గుర్తుతెలియని మహిళ మృతిగా మిగిలిపోతుందని భావించినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, ఇతర కీలక సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా చిరంజీవి నేరాన్ని అంగీకరించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఒకప్పుడు ప్రేమగా మొదలైన పరిచయం విభేదాలకు దారి తీసింది. నష్టపరిహారం పేరుతో మొదలైన రాజీ ప్రయత్నం చివరకు ఓ యువతి ప్రాణాలను బలిగొన్న విషాదంగా మారింది. గుర్తుతెలియని మహిళ మృతదేహంగా మొదలైన ఈ కేసును పోలీసులు ఛేదించి, హంతకుడిని చట్టం ముందు నిలబెట్టారు.

## ఎస్ఐఆర్ నమోదును పరిశీలించిన కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



మహబూబ్‌నగర్, జూన్ 27:నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలోని 31 పీఎస్ పరిధిలో చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.

ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదు ప్రక్రియను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రషీద్, ఎంఆర్ఐ కృష్ణారెడ్డి, బీఎల్‌వో వెంకటేశ్వరమ్మ, బీఎల్ఏ కోరంశివరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖరా (కే)లో పండిన జపాన్ మియాజాకి మామిడి..

ఆదిలాబాద్, జూన్ 27 ఉద్యానవన శాఖ అధికారులు క్రాంతికుమార్, ఉద్యానవన శాఖ ఎస్‌హెచ్‌వో శేఖర్ శనివారం ఇచ్చోడ మండలంలోని ముఖరా (కే) గ్రామంలో పర్యటించి జపాన్‌కు చెందిన అత్యంత ఖరీదైన మియాజాకి మామిడి పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి రకంగా పేరుగాంచిన మియాజాకి మామిడి ముఖరా (కే) గ్రామంలో పండడం విశేషమన్నారు. జిల్లాలోనే మియాజాకి మామిడి మొక్కలను నాటి, విజయవంతంగా పండించిన తొలి గ్రామంగా ముఖరా (కే) నిలిచిందని తెలిపారు.నాలుగేళ్ల క్రితం మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి వ్యవసాయ క్షేత్రంలో నాటిన మియాజాకి మొక్కలు ప్రస్తుతం ఫలాలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ మామిడి పండ్లకు కిలోకు రూ.2 లక్షల వరకు ధర లభిస్తోందని తెలిపారు.రైతులు సాంప్రదాయ పంటలతో పాటు కొత్త ఆలోచనలతో అధిక విలువ కలిగిన పంటలను సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చని సూచించారు.

## అచ్చంపేటలో ప్రైవేట్ స్కూల్ దందాపై వేటు

### -స్కూల్‌లోనే పుస్తకాల విక్రయం
### -సీజ్ చేసిన మండల విద్యాధికారి
### -యాజమాన్యానికి నోటీసులు

మహబూబ్‌నగర్, జూన్ 27: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాల విక్రయం జరుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అచ్చంపేటలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పుస్తకాలు అమ్ముతున్న విషయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు గుర్తించి మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్, ఎం ఎస్ ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్ మాదిగ, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సయ్యద్, ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయగా, మండల విద్యాధికారి శ్రీనివాస మూర్తి స్కూల్‌ను పరిశీలించారు.

తనిఖీల్లో పాఠశాల పరిధిలోనే పాఠ్య పుస్తకాల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో పుస్తకాలు నిల్వ ఉంచిన గదిని అధికారులు సీజ్ చేశారు.

అలాగే స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధి కారి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, "ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలల్లో పుస్తకాల విక్రయం అనుమతించబడదు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అలాంటి ఉల్లంఘనలు గుర్తించినందున గదిని సీజ్ చేసి, యాజమాన్యానికి నోటీసులు అందజేశాం. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం" అని తెలిపారు.




విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకునే విధంగా ప్రైవేట్ స్కూల్స్ వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను సహించబోమని వారు స్పష్టం చేశారు.

## పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి: జేఏసీ

మహబూబ్‌నగర్, జూన్ 27: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ డిమాండ్ చేసింది.

శనివారం విడుదల చేసిన ప్రకటనలో జేఏసీ నాయకులు వ ా ట ్ల ా డ ు త ు ా , పాలమూరు? రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటికీ పూర్తికాలేదని, భూసేకరణ సమస్యలు, నిర్వాసితులకు న్యాయం చేయడంలో జాప్యం కారణంగా ప్రాజెక్టు ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.

గట్టు ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయని, వెల్దండ?గొండిమల్ల బ్యారేజ్ అంశం కూడా ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కీలక సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం విచారకరమన్నారు.

మహబూబ్‌నగర్ రైతులు సాధించుకున్న కృష్ణా జలాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, డిండి ఎత్తిపోతల పథకం పేరిట పాలమూరు రైతాంగానికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ, వినియోగంలో అమలు చేస్తున్న విధానాలు తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు.

తక్కువ వర్షపాతం, కరువు పరిస్థితులను ఎదుర్కోవాలంటే పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడం అత్యవసరమని జేఏసీ పేర్కొంది. జూలై 19న పెండింగ్ ప్రాజెక్టులపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించిన జేఏసీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేసింది.

## బంగారం స్మగ్లింగ్ ముఠాను ఛేదించిన డీఆర్ఐ: వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన దాడుల్లో 15 కిలోల విదేశీ బంగారం స్వాధీనం; 15 మంది అరెస్ట్





న్యూ ఢిల్లీ, జూన్ 27:విదేశీ బంగారం అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీగా దాడులు చేపట్టారు. ముంబై విమానాశ్రయం కేంద్రంగా అత్యంత వ్యవస్థీకృతంగా సాగుతున్న బంగారం అక్రమ రవాణా ముఠాను అధికారులు విజయవంతంగా ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా స్మగ్లింగ్ చేసిన విదేశీ బంగారాన్ని కరిగించడానికి ఉపయోగిస్తున్న ఒక రహస్య కేంద్రాన్నికూడా డీఆర్ఐ అధికారులు గుర్తించి, ధ్వంసం చేశారు.

ముంబయి విమానాశ్రయ సిబ్బందితో పాటు స్మగ్లింగ్ వ్యవస్థలో ఉన్న మొత్తం 9 మందిని అధికారులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒక విమానాశ్రయ ఉద్యోగిని, ఆమెను నడిపించే హ్యాండ్లర్,ముగ్గురు మధ్యవర్తులు, బంగారం కరిగించే కేంద్రం నిర్వాహకుడు, అందులో పనిచేసే మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. దాడి జరిగిన ప్రదేశంలో సుమారు 6 కిలోల విదేశీ మూలాలు కలిగి అక్రమంగా రవాణా చేస్తున్న బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విమానాశ్రయాల లోపలి సిబ్బంది సహాయాన్ని తీసుకుంటూ, తనిఖీలకు దొరకకుండా ఉండేందుకు ఈ వ్యవస్థీకృత స్మగ్లింగ్ ముఠాలు ఎంత అధునాతనమైన, పకడ్బందీ వ్యూహాలను, బహుళ అంచెల పంపిణీ వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయో ఈ కేసు స్పష్టం చేస్తోంది.బెంగళూరులో జరిగిన మరో సోదాల్లో ఒక అంతర్జాతీయ ప్రయాణికుడి నుంచి 1.8 కిలోల బరువున్న 24 క్యారెట్ల బంగారాన్ని డీఆర్ఐ స్వాధీనం చేసుకుంది. నిందితుడు ఈ బంగారాన్ని పేస్ట్ రూపంలో మార్చి, తాను ధరించిన దుస్తుల పొరల మధ్య అత్యంత చాకచక్యంగా దాచి తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ఆ తర్వాత నిందితుడి నివాసంలో జరిపిన తదుపరి సోదాలలో సుమారు 1.5 కిలోల బంగారు ఆభరణాలు, 45 కిలోల వెండి, భారతీయ, విదేశీ కరెన్సీ లభ్యమయ్యాయి. దీంతో అధికారులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు.

ఈ వారం ప్రారంభంలో కూడా డీఆర్ఐ అధికారులు దేశవ్యాప్తంగా వలు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లలో వరుస దాడులు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, రాజ్‌కోట్, కాలికట్, గువహటి, పెట్రాపోల్ ప్రాంతాల్లో జరిపిన ఈ ఆపరేషన్లలో మొత్తం మరో 6 కిలోల విదేశీ మూలాలు కలిగి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ దాడులకు సంబంధించి అయిదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

ఈ భారీ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేయడంతో పాటు దేశవ్యాప్తంగా డీఆర్ఐ జరిపిన అన్ని దాడుల ద్వారా కలిపి సుమారు 15 కిలోల బంగారం, 45 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి మొత్తం విలువ సుమారు రూ. 23 కోట్లు. ఇప్పటివరకు మొత్తం 15 మందిని అరెస్టు చేశారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

### -ఆదిత్య జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు




అమరావతి, జూన్ 27:అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, వాటికి అలవాటు పడితే భవిష్యత్తును తామే నాశనం చేసుకున్న వారవుతారని హెచ్చరించారు.

డ్రగ్స్ వినియోగం వల్ల సమాజంలో అపఖ్యాతి పాలవడంతో పాటు తల్లిదండ్రుల గౌరవం కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. యువత చదువుపై దృష్టి సారించి, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మంచి వ్యక్తిత్వంతో ఎదిగితే సమాజంలో గౌరవం లభించడంతో పాటు తల్లిదండ్రులకు కూడా కీర్తి తీసుకొస్తారని తెలిపారు.

చెడు స్నేహాలకు, మాదకద్రవ్యాలకు, సోషల్ మీడియా వ్యసనానికి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ తీసుకున్నా, విక్రయించినా లేదా అలాంటి ప్రదేశంలో ఉన్నా చట్టరీత్యా నేరమేనని, అలాంటి నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని, బెయిల్ కూడా సులభంగా లభించదని హెచ్చరించారు. డ్రగ్స్‌ను ప్రోత్సహించే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

నరసాపురం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆకుల రఘు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, మహిళలను వేధించడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని అన్నారు. మత్తు పదార్థాల ప్రభావంలో వ్యక్తులు తమ చర్యలపై నియంత్రణ కోల్పోతారని, డ్రగ్స్ వాడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం లేదా ఫిర్యాదుల కోసం డీ-అడిక్షన్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్ 14446కు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు.

అనంతరం విద్యార్థులతో "సే నో టు డ్రగ్స్.. సే యెస్ టు లైఫ్" అనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వాసిరెడ్డి సాయివర ప్రసాద్, హైస్కూల్ ప్రిన్సిపల్ కర్ణ రాజేష్, అశోక్, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి. సూర్యప్రకాశరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.డి. ఫణికర్, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఆర్. పుల్లాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూరత్‌లో 2 కేజీల కొకైన్ స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ - ఒకరి అరెస్టు

న్యూ ఢిల్లీ, జూన్ 27:మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి, సరఫరా వ్యవస్థలను నిర్మూలించడానికి చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో భాగంగా, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ రోజు సూరత్‌లో 2 కేజీల కొకైన్‌ను స్వాధీనం చేసుకుంది. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల ప్రకారం... ఈ అక్రమ రవాణాతో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసింది.

గత నెల రోజుల్లో ముంబయి, ఢిల్లీ, జైపూర్, పాట్నా, కొచ్చిన్, అహ్మదాబాద్‌లోని విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, కొరియర్ టెర్మినళ్లు, రహదారులపై డీఆర్ఐ వరుస ఆపరేషన్లు నిర్వహించింది. ఈ స్వాధీనంతో పాటు, ఈ నెల రోజుల్లో ఇప్పటివరకు మొత్తం సుమారు 26 కిలోల కొకైన్‌ను డీఆర్ఐ స్వాధీనం చేసుకుంది. ఈ ఆపరేషన్లలో 14 మంది విదేశీయులు సహా మొత్తం 22 మందిని అరెస్టు చేశారు.

మత్తుమందు నింపిన క్యాప్సూల్స్ లేదా గుళికలను శరీరంలో అంతర్గతంగా దాచిపెట్టడానికి వాటిని మింగడం... గృహోపకరణాలు, తినే పదార్థాల్లో దాచడం... బట్టలతో వాటిని నానబెట్టడం, సామానులో దాచడం మొదలైన వివిధ పద్ధతుల ద్వారా ఈ నిషేధిత సరుకును అక్రమంగా రవాణా చేశారు.

సమన్వయంతో కూడిన కార్యకలాపాల ద్వారా... మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ రవాణాలో నిమగ్నమైన వ్యవస్థీకృత సిండికేట్‌లను డీఆర్ఐ నిరంతరం లక్ష్యంగా చేసుకుంది. తద్వారా భారత ప్రభుత్వ 'నషా ముక్త్ భారత్' (మాదక ద్రవ్య రహిత భారత్) దార్శనికతకు తోడ్పాటునందిస్తోంది.

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా ప్రతి యేటా జూన్ 26న అంతర్జాతీయ స్థాయిలో పాటిస్తారు. 1987లో ఐక్యరాజ్య సమితి ప్రకటన మేరకు... ప్రపంచవ్యాప్తంగా అక్రమ రవాణా నిరోధక చర్యల బలోపేతం కోసం, మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే వినాశకర ప్రభావాల గురించి అవగాహన పెంపొందించడం కోసం, మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడం కోసం ఈ రోజును అంకితం చేశారు.

## దిగుమతి చేసుకునే మందుల 'మిగులు నిల్వకాలం' నిబంధనలను హేతుబద్ధీకరించే ముసాయిదా సవరణపై ప్రజాభిప్రాయాలను కోరిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జూన్ 27:దిగుమతి చేసుకునే మందుల 'మిగులు నిల్వ కాలం' (షెల్ఫ్ లైఫ్) నిబంధనలను హేతుబద్ధీకరించడానికి... అలాగే ఫార్మా రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని మరింత సులభతరం చేయడానికి వీలుగా 1945 నాటి ఔషధ నిబంధనలలోని నియమం 31కి సవరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్‌ను ప్రచురించింది.

ఈ ప్రతిపాదిత సవరణకు సంబంధించిన ముసాయిదాను ప్రజలు, సంబంధిత వర్గాల అభిప్రాయాల కోసం 2026 జూన్ 22 నాటి గెజిట్ నోటిఫికేషన్ జీ.ఎస్.ఆర్. 505 (ఈ) ద్వారా కేంద్ర ప్రభుత్వం బహిరంగపరిచింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం దేశంలోకి దిగుమతి చేసుకునే మందులకు కనీసం 60 శాతానికి పైగా నిల్వ కాలం మిగిలి ఉండాలి. తాజా సవరణ ద్వారా ఈ నిబంధనను మార్చి, దిగుమతి చేసుకునే సమయానికి ఆ మందులకు కనీసం 12 నెలల నిల్వ కాలం ఉంటే సరిపోయేలా ప్రతిపాదించారు. అయితే, జీవ సంబంధిత ఉత్పత్తులు,రేడియో ఫార్మాస్యూటికల్స్ వంటి మందుల ప్రత్యేక స్వభావాన్ని, ప్రజారోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. వీటికి ప్రస్తుతం అమల్లో ఉన్న 60 శాతానికి పైగా కనీస నిల్వ కాల నిబంధన యథాతథంగా కొనసాగుతుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదిత సవరణ ద్వారా ఔషధ రంగ వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతోపాటు రోగులకు నాణ్యమైన మందులు నిరంతరం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. దేశంలోకి దిగుమతి అయ్యే సమయానికి మందులకు కనీసం 12 నెలల నిల్వ కాలం ఉండటం వల్ల, అవి గడువు తీరడానికి ముందే ప్రజలకు పంపిణీ చేయడానికి, వారు వాడుకోవడానికి తగినంత సమయం లభిస్తుంది. దీనివల్ల రోగులకు తగినంత నిల్వ కాలం ఉన్న సురక్షితమైన మందులు అందుతాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ సవరణ ద్వారా కఠినమైన నిల్వ కాల నిబంధనల వల్ల ఔషధ సరఫరా వ్యవస్థలో అనవసరంగా జరిగే మందుల వృధాను గణనీయంగా తగ్గించవచ్చు. దీనివల్ల ఔషధాల నిల్వలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా సరఫరా నిర్వహణ మెరుగుపడటంతో పాటు ఖర్చులు తగ్గుతాయని, దేశంలో నిత్యావసర మందుల లభ్యత మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ప్రతిపాదిత సవరణ కేవలం మందులను దిగుమతి చేసుకునే సమయంలో వర్తించే షెల్ఫ్ లైఫ్ నిబంధనకు మాత్రమే పరిమితమని కేంద్ర మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ నిబంధనలు 1945 ప్రకారం మందుల నాణ్యత, భద్రత లేదా వాటి పనితీరుకు సంబంధించిన ఇతర నియంత్రణ నిబంధనలలో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసింది.

ఈ ముసాయిదా నోటిఫికేషన్‌పై సంబంధిత వర్గాలన్నిటి నుంచి కేంద్ర ప్రభుత్వం అభ్యంతరాలు, సలహాలను ఆహ్వానించింది. ఆసక్తి గలవారు తమ అభిప్రాయాలను నిర్ణీత గడువులోగా అండర్ సెక్రటరీ (ఔషధాలు), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, యు-6, వర్క్ హాల్‌సీ వింగ్, మొదటి అంతస్తు, కర్తవ్య భవన్-1, న్యూఢిల్లీ-110001 చిరునామాకు సమర్పించవచ్చు.

## 'మాదక ద్రవ్యాల నియంత్రణపై దార్శనిక పత్రం 2026-2029'ని ఆవిష్కరించిన కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, జూన్ 27: కేంద్ర హోం -సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన నార్కో-కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌కార్డ్) 10వ ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'ఎన్‌సీబీ వార్షిక నివేదిక-2025' సహా 'మాదక ద్రవ్యాల నియంత్రణపై దార్శనిక పత్రం 2026- 2029'ని కూడా ఆయన ఆవిష్కరించారు. దీంతోపాటు జమ్ము, గువహటి నగరాల్లో 'ఎన్‌సీబీ' జోనల్ కార్యాలయాలను ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా ప్రారంభించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా పట్టుబడిన -6,000 కోట్ల విలువైన 2,09,500 కిలోల మాదక ద్రవ్యాల నిర్మూలన దిశగా 'మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షం' పేరిట ఒక ఆన్‌లైన్ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

అనంతరం శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ- మాదక ద్రవ్యాలపై పోరాటంలో దేశం నేడొక కీలక మలుపులో నిలిచిందని పేర్కొన్నారు. మరో మూడేళ్లలో ఈ వ్యసనం మనల్ని ఓడించడం కాకుండా దాన్నే మనం కూకటివేళ్లతో పెళ్లగిస్తామన్నది వాస్తవం కాగలదన్నారు. రాబోయే వందేళ్ల దేశ భవిత కోసం మనమంతా దృఢ సంకల్పంతో, సమష్టి కృషితో ఈ యుద్ధం గెలవడం అనివార్యమన్నారు. ఇది ఏదో? ఒక శాఖ, రాష్ట్రం, ప్రభుత్వం లేదా వ్యక్తితో సాధ్యమయ్యేది కాదని చెప్పారు. అన్ని రాష్ట్రాలు, సంబంధిత శాఖలు, విభాగాలన్నీ ఒకే వేదికపైకి రావాలని సూచించారు. ప్రజలను ఉత్తేజపరిచే వ్యక్తులను, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతను, మహిళా శక్తిని కూడా ఇందులో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో మన విజయం పూర్తిగా ఈ కృషిపైనే ఆధారపడిఉందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల సమస్య శాంతిభద్రతలు లేదా ప్రజారోగ్యంతో మాత్రమే ముడిపడినది కాదని శ్రీ అమిత్ షా చెప్పారు. జాతీయ భద్రత, సామాజిక స్థిరత్వం, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ, యువతరం భవిత సహా దేశ పురోగమనంతో పెనవేసుకున్న అంశమని తెలిపారు. దీనిపై సంపూర్ణ విజయమే దేశంలోని రాష్ట్రాలన్నిటి సమష్టి జాతీయ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

మాదక ద్రవ్యాల దొంగ రవాణా, వ్యవస్థీకృత నేరాలు, నార్కో-ఉగ్రవాద వనరులు, సరిహద్దు ఉగ్రవాద మూకలకు నిధులు సమకూర్చడం సహా నేడు ఈ బెడద నార్కో-ఉగ్రవాద వ్యవస్థగానూ పరిణామం చెందిందని ఆయన వివరించారు. జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ, యువతరం భవిష్యత్తు కోసం ఈ ముప్పుపై మనం పూర్తిస్థాయిలో విజయం సాధించడం అవశ్యమని చెప్పారు. మాదకద్రవ్యాల పీడ రీత్యా మనం భౌగోళికంగా 'మరణ త్రిభుజం', 'మరణ అర్ధచంద్రాకారం' నడుమ ఉన్నామని గుర్తుచేశారు. డ్రోన్లతో డ్రగ్స్ జారవిడవడం, సముద్ర మార్గాల్లో కంటెయినర్లలో రవాణా, డార్క్‌నెట్, క్రిప్టో చెల్లింపులు, ఆర్డర్-టు-డెలివరీ పద్ధతులు, పార్శిల్ రవాణా తదితర పద్ధతుల్లో దొంగ రవాణాదారులు మన పోరాటాన్ని మరింత సవాలుగా మారుస్తున్నారని తెలిపారు. ఈ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానంతో మరింత శక్తి పుంజుకుని, నెట్‌వర్క్ ఆధారిత కార్యకలాపాలు సాగిస్తున్నారని చెప్పారు. తద్వారా బహుళ రంగ నేర స్వరూపంతో మనతో తలపడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి, ఈ సంక్లిష్ట పోరాటంలో మన ప్రతిస్పందన కూడా సామూహికంగా, వ్యవస్థీకృతంగా, వ్యూహాత్మకంగా, ఆధునికంగా, పటిష్ట నిఘా ఆధారితంగా ఉండాలని చెప్పారు. అలాగే, సాంకేతికతతో నడిచే విధానం ద్వారా నిర్దాక్షిణ్య వైఖరితో నెట్‌వర్క్ కేంద్రక యుద్ధం చేస్తేనే ఈ మహమ్మారిని నిర్మూలించడం సాధ్యమని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల దొంగ రవాణాలో పాలుపంచుకునే వారిపై కఠిన వైఖరి వీడకుండానే బాధితులపై సానుభూతితో వ్యవహరించాలని కేంద్ర హోం మంత్రి అన్నారు. మన కరుణ, సద్భావనతో మాత్రమే వ్యసనపరులను తిరిగి సాధారణ జీవనంలోకి తీసుకురాగలమని, ఆ మేరకు వారిని చేయి పట్టుకుని సన్మార్గంలోకి నడిపించాలని సూచించారు.

ఈ బెడద నిర్మూలనలో మన పోరాట రూపాన్ని నాలుగు మూలస్తంభాల కింద నేటి ప్రదర్శనలో వివరించామని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. అలాగే, ప్రతి మూలస్తంభం కింద ఉప స్తంభాలను స్పష్టంగా నిర్వచించడమేగాక ఒక్కొక్కదానికి నిర్దిష్ట లక్ష్యాలు సహా వాటి సాధనకు వ్యవధిని కూడా నిర్దేశించామని ఆయన తెలిపారు.

## కూతురి చావుకు ప్రతీకారం.. అల్లుడి హత్యకు అత్త స్కెచ్, రూ.10 లక్షల సుపారీ




జయశంకర్ భూపాపల్లి , జూన్ 27:తన బిడ్డ చావుకు కారణమై అల్లుడిపై ప్రతీకారం తీర్చుకోవాలని అత్త పగతో రగలిపోయింది. అల్లుడిని అంతమొందించేకు సమయం కోసం ఎదురు చూసింది. తన కూతరిని కడతేర్చిన దుర్మార్గుడిని ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకొని సుపారీ ఇచ్చి మరీ అంతం మొందించేకు ప్రయత్నించించింది. ఇంతలోనే కథ అడ్డం తిరిగింది. వివరాల్లోకి వెళ్తే..అల్లుడిని హత్య చేయించేందుకు రూ.10 లక్షల సుఫారీ ఇచ్చి కుట్ర పన్నిన అత్తతో పాటు మరో నలుగురిని కాటారం పోలీసులు శుక్ర వారం అరెస్ట్ చేశారు.

జయశంకర్ భూపాపల్లి జిల్లా కాటారం మండలంలోని ధన్వాడ- గుమ్మళ్లపల్లి మార్గంలో ఈ నెల 23న ప్రైవేట్ కళాశాల నిర్వాహకుడు చిగురు గణేశ్‌పై జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. కాటారం సీఐ నాగార్జున రావు కథనం ప్రకారం.. గారెపల్లి గ్రామానికి చెందిన చింత రాజేశ్వరి కుమార్తె సంధ్యకు 2017లో ఒడిపిలవంచకు చెందిన చిగురు గణేశ్‌తో వివాహం జరిగింది. అదనపు కట్నం వివాదాల నేపథ్యంలో 2023 జూలై 31న భార్య సంధ్యను గణేశ్ హత్య చేశాడు.

ఈ కేసులో గణేశ్ జైలుకు వెళ్లి, ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. దీంతో అల్లుడిపై ప్రతీకారం తీర్చుకోవాలని రాజేశ్వరి నిర్ణయించుకుంది. కరీంనగర్‌లో నివసిస్తున్న ధరంసోత్ రవీందర్ నాయక్‌ను సంప్రదించి రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, అడ్వాన్స్‌గా రూ.లక్షతో పాటు గణేశ్ ఫొటోను ఇచ్చింది. అనంతరం రవీందర్ నాయక్ మరో ముగ్గురిని కలుపుకుని శుక్రవారం ఒడిపిలవంచలో రెక్కీ నిర్వహించారు. మరుసటి రోజు కారుచెడి పోయినట్లు నమ్మించి గణేశ్‌ను సహాయం కోరగా, అతడు కారు తోస్తుండగా నాగార్జున్ కత్తితో దాడి చేశాడు.

గణేశ్ కేకలు వేయడంతో రైతులు రావడాన్నిగమనించి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. మిగిలిన డబ్బుల కోసం ఈ నెల 26న రాజేశ్వరి ఇంటి వద్ద నిందితులు చర్చిస్తుండగా సమా చారం అందుకున్న సీఐ నాగార్జున రావు, ఎస్సై శ్రీనివాస్, ఎస్సై-2 మహేశ్, నరేశ్ దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. విచారణలో సుపారీ తీసుకొని హత్యాయత్నం చేసినట్లుగా నిందితులు అంగీకరించడంతో ప్రధాన నిందితురాలు రాజేశ్వరితో పాటు ధరంసోత్ రవీందర్ నాయక్, దామోదర్, నాగార్జున్, ప్రశాంత్‌ను కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ సూర్య నారాయణ అభినందిం చారు.

## ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు.. ముగ్గురు దుర్మరణం

అమరావతి, జూన్ 27: కడప జిల్లా చెన్నూరు మండల శివార్లలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఈ ఘటనలో పలువురు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చెన్నూరు శివారులో అతివేగంతో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రెండు వాహనాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం కడపలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి పంపారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ లేదా ఇతర సాంకేతిక కారణాలవల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. మృతులు, గాయపడిన వారి పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలి





లక్ష్మణచాంద, జూన్ 26 : ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదునూ చట్ట ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని పోలీసులకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. లక్షణచాంద మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, బెయిల్ కేసుల నిర్వాహణ, రిసెప్షన్, మాల్ఖాన, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరు సిబ్బంది హాజరు రిజిస్టర్లు, పోలీస్‌స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం, లక్ష్మణ్ చందా పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాస్, సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మ ణ్ చందా, ఎస్ఐ శ్రావణి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వా రా అందిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.


## మాదకద్రవ్యాలను నిర్మూలించాలి-ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూన్ 27మాదకద్రవ్యాలను నిర్మూలనకు యువత కృషి చేయాలని, గంజాయి రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలని ఎస్పీ అఖిల్ మ హాజన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురసరించుకుని జిల్లా పోలీ సు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్‌లో ఘ నంగా 5కే రన్ నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రారంభమైన ఈ రన్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి ప్రారంభించారు.

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చి న సుమారు 2 వేల మంది యువత, క్రీడాకారులు, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని యువతకు సూచించారు. వ్యసనానికి గురైన వారికి చికిత్స అందేలా కృషి చేయడం కూడా సమాజ బాధ్యతేనని పేరొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.




# ముళ్ళపూడి నవ్వులలో నిత్య సత్య సందేశం



తెలుగు సాహిత్యంలో హాస్యాన్ని ప్రబోధకంగా, సామాజికంగా, మానవీయంగా మలచిన సృజనశీలుల్లో ముళ్ళపూడి వెంకటరమణ అగ్రగణ్యులు. నవ్వుల్లోనూ జీవన పాఠాలు, మాటల్లోనూ మానవతా విలువలు నిక్షిప్తమై ఉండేలా ఆయన రచనలు సాగేవి. హాస్యాన్ని అపహాస్యంగా కాక, ఆత్మ విశ్లేషణకు దారితీసే సాధనంగా మార్చిన కళాకారుడిగా వెంకటరమణ చిరస్మరణీయులయ్యారు.


1931 జూన్ 28న తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించిన ఆయన చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. కుటుంబ పోషణ బాధ్యత తల్లిపై పడి, చిన్ననాటి నుంచే జీవితాన్ని సమీపంగా అనుభవించే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజమండ్రిలో బాల్యం, మద్రాసులో విద్యాభ్యాసం సాగినా ? చదువు కన్నా జీవితమే ఆయనకు గొప్ప గురువు అయింది. తెలుగు భాష మీద ప్రేమ, సాహిత్యంపై ఆసక్తి ఆయనను రచయితగా తీర్చిదిద్దాయి.

వెంకటరమణ రచనా ప్రస్థానం చిన్న కథలతో మొదలై, నవలలు, వ్యాసాలు, బాల సాహిత్యం, సినీ సంభాషణలు తదితర రంగాలకు విస్తరించింది. మానవ సంబంధాల సౌమ్యత, మధ్య తరగతి జీవన విశేషాలు, సమాజపు ద్వంద్వ ధోరణులపై హాస్యమయం అయిన లోతైన వ్యాఖ్యానం ఆయన రచనల విశిష్టత. తేటతెల్లమైన భాష, నుడికారంలో నైసర్గిక ప్రవాహం, పాత్రల సహజత .. ఇవన్నీ కలగలిసి ఆయన రచనలను అందరికి ఆప్యాయంగా మలిచాయి.




'బుడుగు' అనే చిన్నారి పాత్ర ఆయనకు అజరామర గుర్తింపును తీసుకు వచ్చింది. పిల్లవాడి అమాయకపు దృష్టికోణం ద్వారా పెద్దల ప్రపంచాన్ని అన్వయించడం, వ్యంగ్యంగా కాక తార్కికంగా చూపడం ఆ రచన విశిష్టత. పిల్లలు నవ్వుతూ చదివే కథల్లో పెద్దలకు జీవి తాన్ని అర్థం చేసుకునే సందేశా లుండేవి. 'కొసరు కొమ్మ చ్చి', 'చింత చిగురు', 'ఇంట్లో పుట్టిన బిల్లు', 'కొత్త జగత్తు', 'అరగంటా అందాల తీన్మార్' వంటి రచనలు కూడా తనదైన హాస్య చిత్రణకు నిలువెత్తు ఉదాహరణలు.

వెంకటరమణ కాలమిస్టుగానూ ఖ్యాతి గాంచారు. ముఖ్యంగా 'ఆంధ్రజ్యోతి'లో 'రమణక్కి రామాయణం' శీర్షికతో వచ్చిన వ్యాసాలు సామాజిక అంశాలను సరళంగా, వినోదాత్మకంగా సమీక్షించేవి. ఆయన కలం సామాన్యుడి శబ్దానికి ప్రతిధ్వనిలా మారింది. చక్కటి చమత్కారం, వ్యంగ్యం, విలక్షణమైన హాస్య వర్ణన ఆయన శైలిలో అంతర్లీనంగా కలిసి ఉండేది. ఆనందవాణి, ఆంధ్రభూమి, విశాలాంధ్ర వంటి పత్రికల పాఠకులందరికీ ఆయన పేరు సుపరిచితమైంది.




వెంకటరమణ సాహిత్య జీవితంలో బాపు పాత్ర అనన్య సామాన్యం. బాపు బొమ్మలకు వెంకటరమణ పదాలు జోడైనపుడు ఆ కలయిక కళాపరంగా, సాహిత్యపరంగా ఒక కొత్త తరహా శైలిని తెలుగు ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ఇద్దరి అనుబంధం స్నేహానికి, సృజనాత్మకతకు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచింది. వీరిద్దరి కలయిక వల్లే ఎన్నో బాల సాహిత్య రచనలు, బొమ్మల పుస్తకాలు, ముద్రిత రూపాల్లో వెలుగులోకి వచ్చాయి.

సినీరంగంలో కూడా ఆయన ప్రభావం అంతే విస్తృతమైనది. బాపు దర్శకత్వంలో రూపొందిన 'ముత్యాల ముగ్గు', 'సీతాకోక చిలుక', 'పెళ్లి పుస్తకం', 'స్వర్ణ కమలం', 'రాధాకృష్ణ', 'అభిలాష' వంటి చిత్రాలకు ఆయన రచనలు, సంభాషణలు హృదయాన్ని తాకేలా ఉండేవి. తెలుగు భాషకు ఒరిగిన సంభాషణలు, ముద్దు ముద్దుగా పలికే పద ప్రయోగాలు ఆయన సంభాషణల్లో ప్రధాన ఆకర్షణ. ఆ సినిమాల్లో భావోద్వేగం, హాస్యం, సంస్కృతి అన్నీ కలగలిసి ఒక సౌందర్యాన్ని సృష్టించేవి.

ఆయన రచనల్లో హాస్యం ఎప్పుడూ హుందాగా, పరిమితి కోల్పోకుండా, చింతనకు ఆహ్వానం ఇచ్చేలా ఉండేది. ద్వేషం లేకుండా విమర్శించ గలిగిన తీరే ఆయన రచనా శైలికి ఉమ్మడి లక్షణం. హాస్యం అనేది ఓ జ్ఞాన పరమైన ప్రకటనగా రూపాంతరం చెందుతుంది. ఈ తత్వాన్ని ప్రతిపాదించిన రచయితలలో ఆయన ముందు వరుసలో నిలిచారు.

తెలుగు సాహిత్యంలో హాస్యాన్ని తక్కువ చేసి చూడడాన్ని ఆయన రచనలు ఖండించాయి. ఆయన రచనల శక్తి ? ఒక హాస్యపు పదంతో కన్నీటి కారక సత్యాన్ని కూడా చెప్పగలిగే సామర్థ్యంలో ఉంది. చిన్న కథలు, కాలమ్ వ్యాసాలు, బాల కథలు, సినిమాల సంభాషణలు ? అన్ని రూపాల్లోనూ ఆయన తనదైన ముద్ర వేసుకున్నారు.

ఆయన రచనా సంపద తెలుగుకు ఒక సాంస్కృతిక సంపద. అవి భాషను శుద్ధంగా, సహజంగా వినిపించగలిగే ఉత్కృష్ట నమూనాలు. పాఠకుల హృదయంలో చిరకాలం నిలిచిపోయేలా చేసిన శక్తి ఆయన పదాల్లో, భావాల్లో, హాస్యంలో ఉంది.




2011 ఫిబ్రవరి 24న ఆయన భౌతికంగా కన్ను మూసినా, ఆయన కలం సృష్టించిన సాహిత్యం మాత్రం కాల గమనాన్ని అధిగమించి, తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ముళ్ళపూడి వెంకటరమణ రచయితగా మాత్రమే కాకుండా, ఒక యుగ కర్తగా, తెలుగు హాస్యానికి ఓ అపూర్వ, అపురూప పాత్రధారుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

తెలుగు పాఠకుల హృదయంలో నవ్వుల వెనక నిగూఢమైన జీవన సత్యాన్ని ప్రతిబింబించిన చిరస్థాయి కాంతివంతమైన కలం ముళ్ళపూడి వెంకటరమణకే సొంతం.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



## ఢిల్లీలో గ్రామీణాభివృద్ధిపై జూన్ 28-29 తేదీల్లో తొలి జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, జూన్ 27:న్యూఢిల్లీలోని పూసాలో ఉన్న భారతరత్న సి. సుబ్రమణ్యం ఆడిటోరియంలో జూన్ 28, 29 తేదీల్లో 2026 జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సును నిర్వహిస్తున్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొంటారు. వీరంతా కలిసి గ్రామీణ భారతదేశ సమగ్ర అభివృద్ధి గురించి చర్చించడంతో పాటు, కీలకమైన ప్రధాన పథకాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా, గ్రామీణ భారతదేశంలో సమగ్రమైన, సుస్థిరమైన, మార్పుదాయక అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక విస్తృతమైన జాతీయ చర్చను చేపట్టనుంది. కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో, ఈ తరహాలో జరుగుతున్న మొట్టమొదటి భారీ జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సు ఇదే కావడం విశేషం. గ్రామాల అభివృద్ధి కోసం ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది.

'వికసిత్ గ్రామ్, వికసిత్ భారత్' సంకల్పాన్ని నిజం చేయాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు శ్రీ చౌహాన్ తెలిపారు. విబి-గ్రామ్ జి చట్టం - 2025 ను సమర్థవంతంగా అమలు చేయడం, గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రణాళికా ప్రక్రియలను బలోపేతం చేయడం, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం వంటి కీలక గ్రామీణాభివృద్ధి పథకాల అమలు తీరును, వాటి పురోగతిని ఈ సదస్సు సమగ్రంగా సమీక్షిస్తుందని కేంద్రమంత్రి తెలిపారు.

### సదస్సులో పాల్గొననున్న అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు

ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరు కానుండడం విశేషం. వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుతో సంబంధం ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు, విషయ నిపుణులు కూడా చర్చల్లో పాల్గొంటారు. ఈ జాతీయ వేదిక రాష్ట్రాల అనుభవాలు, వినూత్న ఆవిష్కరణలు, క్షేత్రస్థాయి సవాళ్ళపై బహిరంగ చర్చలకు వీలు కల్పించడం ద్వారా మరింత పటిష్టమైన, ఆచరణాత్మకమైన విధానాల రూపకల్పనకు మార్గాన్ని సుగమం చేస్తుంది.

### వివిధ అంశాలపై ప్రత్యేక చర్చాగోష్టులు - ఉత్తమ పద్ధతులపై దృష్టి

ఈ సదస్సులో గ్రామీణ గృహనిర్మాణం, రహదారుల అనుసంధానం, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రత్యేక చర్చాగోష్టులు, ప్రత్యేక సెషన్లు ఉంటాయని శ్రీ చౌహాన్ తెలిపారు.

## చుట్టుముట్టిన కోతులు.. కొండ పైనుంచి పడి నవ వధువు మృతి

చెన్నై, జూన్ 27: కొత్తగా పెళ్లైన మహిళ తన భర్తతో కలిసి కొండపై ఉన్న ఆలయాన్ని దర్శించింది. అక్కడి కోతులకు పండ్లు పెడుతుండగా అవి చుట్టుముట్టాయి. భయాందోళన చెందిన నవ వధువు అదుపుతప్పి కొండ పైనుంచి కింద పడి మరణించింది. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తిట్టన్‌కులం ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల అనితకు గత నెలలో 29 ఏళ్ల సురేష్‌తో వివాహం జరిగింది. విదేశాల్లో పనిచేసే అతడు ఇటీవల తిరిగివచ్చాడు.

కాగా, అనిత తన భర్త సురేష్‌తో కలిసి కజుగుమలైలోని కలుగసలమూర్తి ఆలయాన్ని దర్శించింది. ప్రధాన ఆలయంలో పూజల తర్వాత ఆ దంపతులు కొండపై ఉన్న ఉచ్చిపిళ్ళైయార్ ఆలయానికి వెళ్లారు. అక్కడ కోతులకు పండ్లు తినిపిస్తుండగా అకస్మాత్తుగా పలు కోతులు వారిని చుట్టుముట్టాయి. భయాందోళన చెందిన అనిత అదుపుతప్పింది. కొండ పైనుంచి కింద పడి మరణించింది. ఇది చూసి భర్త సురేష్ షాకయ్యాడు.

మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అనిత మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. అనిత కొండ పైనుంచి కిందపడి మరణించడానికి దారితీసిన పరిస్థితులతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## అపరిచితులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవద్దు..

### -అనుమానాస్పద సమాచారం 1972కు ఇవ్వాలని పిలుపు



అమరావతి, జూన్ 27: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఏపీ ఈగల్ ఎస్పీ కె. నగేష్ బాబు పిలుపునిచ్చారు. గుంటూరు ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎం మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

1980-81 విద్యాసంవత్సరంలో ఇదే పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ప్రస్తుతం ఎస్పీ స్థాయికి చేరుకున్న నగేష్ బాబు, తన పాఠశాల రోజుల అనుభవాలను, ఉపాధ్యాయుల బోధనలను గుర్తు చేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన ఎదుగుదలకు ఈ పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు.

అపరిచితులు ఇచ్చే చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు, ఇతర ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని విద్యార్థులకు సూచించారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తి తెలియక డ్రగ్స్ కలిపిన చాక్లెట్లు తిని వ్యసనానికి గురై చివరకు పునరావాస కేంద్రంలో చేరాల్సి వచ్చిన ఘటనను ఉదాహరణగా వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమాజంలో గంజాయి, డ్రగ్స్ వంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఏపీ ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల తరఫున మెరిట్ స్కాలర్‌షిప్‌లను ఎస్పీ కె. నగేష్ బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా కూడా సేవలందించిన అనుభవం ఉన్న నగేష్ బాబు చేసిన సూచనలు విద్యార్థుల్లో అవగాహన పెంచాయి.

## 48వ డివిజన్‌లో రూ.20 లక్షలతో డ్రైన్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 27:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నగరంలోని 48వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో రూ.20 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న పైప్ లైన్ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ ××కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. చేపట్టిన పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, 48వ డివిజన్ కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్× గారు, కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్ గారు, బండ రమణా రెడ్డి గారు, గాజ రమా శివరామ్ గారు, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్ గారు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## జూలై 2న షేర్ అలిబాబా ఉర్స్ ఉత్సవాలు ప్రారంభం

### ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన గులాం అహ్మద్ హుస్సేన్, దర్గా కమిటీ సభ్యులు




కరీంనగర్ తిమ్మాపూర్ జూన్ 27:-నగరంలోని కేబుల్ బ్రిడ్జి పక్కనే గల, అలుగునూర్ శివారులోని హజరత్ షేర్ అలీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు వచ్చే నెల జూలై 2, 3వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ అలీ శనివారం తెలిపారు. ఈ మేరకు నగరంలో ఎంఐఎం కార్యాలయంలో దర్గా ఉర్సు ఉత్సవాల పోస్టర్ ను ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, దర్గా కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. జూలై 2న షాసాహెబ్ మొహాల్ల నుంచి కమాన్ మీదుగా బైపాస్ రోడ్, అలుగునూర్ చౌరస్తా నుంచి దర్గా వరకు సందల్ మహోత్సవం ర్యాలీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 3న దర్గాలో దీపాలు (చిరాగ్) వెలిగించే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ దర్గా ఉరుసు ఉత్సవాలకు మానకొండూర్ తిమ్మాపూర్ కరీంనగర్ పెద్దపల్లి సిరిసిల్ల హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని చెప్పారు. ఎవరు స్వేచ్ఛ వాళ్లను ప్రతి ఒక్కరూ కుల మతాల కతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని దర్గా అధ్యక్షుడు వాజిద్ అలీ కోరారు. ఈకార్యక్రమంలో దర్గా ప్రధాన కార్యదర్శి నదీమొద్దీన్ ఖాద్రి, సభ్యులు యూసుఫ్ బేగ్, అలీ, ఆయూబ్ ఖాన్, ఫహీం, మూసా తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.